
సాక్షి
బాపట్ల
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



వైభవంగా 16రోజుల పండుగ

ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని కోటి ఒక్కలింగాల ఆలయంలో మహాకాళేశ్వర, మహంకాళి విగ్రహాల ప్రతిష్ట తర్వాత మంగళవారం 16రోజుల పండుగ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 518.60 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 7,595 క్యూసెక్కులు వదిలారు.

చందోలులో హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ కలెక్టర్

నరసరావుపేట: ఎన్నికల నేపథ్యంలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న డయల్ యువర్ కలెక్టర్ ఉదయం 10 నుంచి 11గంటల వరకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం పేర్కొన్నారు. ప్రజలు 08647–252999 నంబరుకు డయల్‌చేసి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

బియ్యం వివరాలు ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలి

జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరువెస్ట్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం, బియాన్ని వ్యాపారులు, రిటైలర్లు, చిల్లర వ్యాపారులు, పెద్ద రిటైలర్స్ తమ వద్ద ఉన్న స్టాకును ప్రతి శుక్రవారం ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మంగళవారం తెలిపారు. తాము తనిఖీలు చేసేటప్పుడు నిబంధనలు అతిక్రమించి నిల్వలు ఉంచే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం ప్రత్యేక బృందాలు నిరంతరం పనిచేస్తాయన్నారు. అక్రమ వ్యాపారుల సమాచారాన్ని పౌరులు తమకందించాలని తెలిపారు.

విద్యుత్ బీసీ ఉద్యోగుల క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



తెనాలిటౌన్: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ బి.జయభారతరావు తెలిపారు. విద్యుత్ బి.సి.ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం చినరావూరులోని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరిశ వెంకటేశ్వరరావు గృహంలో మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జయభారతరావు సంక్షేమ సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ వి.అనురాధ, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.గుణవంతుడు, వైస్ ప్రెసిడెంట్ నరసింహారావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సుబ్బయ్య, అడ్వయిజర్ చంద్రమౌళి, ఏపీసీపీడీసీఎల్ ప్రెసిడెంట్ అక్కల సత్యనారాయణ, సెక్రటరీ చెన్నకేశవరావు, ఎస్‌సీడీసీఎల్ సెక్రటరీ రామరాజు, ట్రాన్స్‌కో, జన్‌కో నాయకులు, డిస్కం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తెనాలి జట్టు



తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో తెనాలి రూరల్ మండలానికి చెందిన పురుషుల వాలీబాల్ జట్టు జిల్లాస్థాయిలో విజయం సాధించింది. ఈనెల 9వ తేదీనుంచి విశాఖపట్టణంలో జరగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా క్రీడాకారులను తెనాలి ఎంపీడీవో కె.శిల్ప అభినందించారు. స్థానిక కొత్తపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో జట్టు కెప్టెన్‌ను శాలువతో సత్కరించారు. విశాఖపట్టణంలో జరగనున్న అంతరజిల్లాల రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. తెనాలి రూరల్ మండలం నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో మొత్తం 180 జట్లు పాల్గొన్నాయని, వీటిలో మూడు జట్లు జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాయని వివరించారు.

56,233 హెక్టార్లలో రబీ పంటల సాగు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా లో రబీ పంటల సాధారణ విస్తీర్ణం 72,300 హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు 56,233 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. గత అక్టోబర్ 3వ వారం నుంచి రబీ సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో వరి సాధారణ సాగు 1,126 హెక్టార్లు ఉండగా 234 హెక్టార్లలో నాట్లు వేశారు. జొన్న 20,444 హెక్టార్లకు 9991 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న 20,670 హెక్టార్లకు 12,461 హెక్టార్లలో సాగు చేశారు. మంచి శనగ 8,552 హెక్టార్లకు 10,505 హెక్టార్లలో, పెసర 10,747 హెక్టార్లకు 8,436 హెక్టార్లలో, మినుము 5,782 హెక్టార్లకు 6,160 హెక్టార్లలో, కంది 64 హెక్టార్లకు 42 హెక్టార్లలో, పొగాకు 775 హెక్టార్లకు 2,077 హెక్టార్లలో, మిరప 1,550 హెక్టార్లకు 5,936 హెక్టార్లలో, ఉల్లి 31 హెక్టార్లకు 42 హెక్టార్లలో, టమాటా 49 హెక్టార్లకు గాను 16 హెక్టార్లలో, నువ్వులు 43 హెక్టార్లకు 11 హెక్టార్లలో, పత్తి 9 హెక్టార్లలో, ఇతర కూరగాయలు 700 హెక్టార్లకు 193 హెక్టార్లలో, ఇతర పంటలు 1,688 హెక్టార్లకు 120 హెక్టార్లలో సాగైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు 'సాక్షి'కి వివరించారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా

- నాలుగు విడతలుగా డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేసిన సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- పంగులూరులో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ



డ్వాక్రా మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

జే.పంగులూరు: అక్కచెల్లెమ్మలను ఆదుకున్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే అని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా 4వ విడత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హనిమిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో జగనన్న రాష్ట్ర ప్రజల ప్రయోజనార్థం అనేక మార్లు బటన్ నొక్కారని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మీ కోసం, జగనన్న కోసం రెండుసార్లు బటన్ నొక్కాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 11, 2019 నాటికి రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు ఉన్న రూ.25,570 కోట్ల బకాయిలను నాలుగు విడతలుగా రుణమాఫీ చేసిన ఘనత జగనన్నకే సాధ్యం అన్నారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలనే డ్వాక్రా రుణ మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీన వైఎస్సార్ చేయూత కింద 45 నుంచి 60 సంవత్సరాల్లోపు మహిళలకు వైఎస్సార్ చేయూత నగదు జమచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. మహిళలకు ఒక తోబుట్టువులా సీఎం జగన్ అండగా ఉంటున్నారన్నారు.

ఏపీ వైపు ఇతర రాష్ట్రాల చూపు..

దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రయోజనాల నిమిత్తం ఇప్పటికి రూ. 2,53,000 కోట్లు డీబీటీ ద్వారా ప్రజలకు నేరుగా వారి ఖాతాలోకి జమ చేశారన్నారు. దేశం మొత్తం రాష్ట్రం వైపే చూస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ పథకాలు మన రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. చంద్రబాబుకు ఎన్ని జిమ్మిక్కులు, కుయుక్తులు ఉన్నాయో



చిన హనిమిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న డ్వాక్రా మహిళలు

అద్దంకిలోని తెలుగుదేశం పార్టీ నాయకుడికి అన్ని జిమ్మిక్కులు, కుయుక్తులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం నియోజకవర్గ ప్రజలు అలాంటి నాయకులను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. జగనన్న అందిస్తున్న పథకాలు ద్వారా లబ్ధిదారులు పొందిన ప్రయోజనాలు వింటుంటే ఆనందభాష్పాలు వస్తున్నాయన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేశారు. తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వీఓఏలు చిన హనిమిరెడ్డికి శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ, ఎంపీడీఓ మాథ్యుబాబు, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జెడ్పీటీసీ రాయిణి ప్రమీళ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు బీవీ క్రిష్ణారెడ్డి, మండల కన్వీనర్ స్వయంపు హనుమంతరావు, నాయకులు జంపాని రవిబాబు, పులికం కోటిరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు రాము, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చక్రవరం భాస్కర్‌రాజు, ఏసీ రవికుమార్, ఎల్‌సీ విజయ్‌భాస్కర్, మండల సమైఖ్య అధ్యక్షురాలు బాచిన నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'నంబర్ వన్ సీఎం' గా జగనన్న

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ నంబర్ వన్ సీఎంగా గుర్తింపుపొందారని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని వేమవరం గ్రామంలో 'పల్లెపల్లెకు హనిమిరెడ్డి' కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన హనిమిరెడ్డికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ఐదేళ్లలో జగనన్న 124 సార్లు బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందించటం వల్లే సిద్ధం సభలకు అపూర్వ ప్రజాదరణ లభిస్తుందని చెప్పారు. ఈ ప్రజాదరణ చూసి చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌లకు మతి భ్రమించి అవాకులు, చవాకులు పేలుతున్నారని ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. తాను నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, అద్దంకి ఎమ్మెల్యేగా తనను ఓటుతో ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. అంతకు ముందు గ్రామంలోని అంకమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ సుబ్బయ్య చౌదరి, ఎంపీటీసీ సభ్యురాలు గోరంట్ల అలివేలమ్మ, వల్లాపల్లి, కేరాజుపాలెం సొసైటీల అధ్యక్షులు మంచాల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు సుబ్బారావు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

- జిల్లా కలెక్టర్ కలెక్టర్ పి.రంజిత్ బాషా
- 'జగనన్నకు చెబుదాం'లో అర్జీలు స్వీకరణ

భట్టిప్రోలు: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో నమోదైన అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, అర్జీలు స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. భట్టిప్రోలు మండలం నుంచి ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లా అధికారులకు 350 అర్జీలు వచ్చాయని, వీటిలో 285 పరిష్కారమయ్యాయని, 46 అర్జీలు పునావృతమైనట్లు వెల్లడించారు. వీటిని సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. జగనన్న కాలనీలలో పక్కా గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. సచివాలయాలలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు లక్ష్యాలను నిర్దేశించినప్పటికి చేరుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 10వ తేదీలోగా స్టోన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని వీఆర్‌ఓలకు సూచించారు. జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఆర్డీఓ హేలా షారోన్, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, తహసీల్దార్ ఎం.సుభద్ర, ఎంపీడీఓ జేవీబీ మల్లిఖార్జునరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి, సర్పంచ్ దారా రవి కిరణ్మయి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ సమర్థంగా నిర్వహించాలి..

బాపట్ల: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను అధికారులు సమర్థంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలపై మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో జరుగుతాయని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. 13 కేంద్రాలలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నామన్నారు. 8,175 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ప్రాక్టికల్స్ నిర్వహణపై పర్యవేక్షణ అధికారులను నియమించాలని ఆర్‌ఐఓను ఆదేశించారు. మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐఓ యర్రయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్టీసీ ఆర్ఎం పాల్గొన్నారు.

పంట రుణాలను పదిశాతం పెంచాలి...

బాపట్ల: వ్యవసాయ రంగంలో పంట రుణాలను పది శాతానికి పెంచి రైతులకు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. పీడీసీసీ బ్యాంక్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. జిల్లాస్థాయి కమిటీలో చర్చించిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు అధికమవుతున్న తరుణంలో రైతులకు పంట రుణాలు పెంచాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. పీడీసీసీ బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి, ఎల్‌డీఎం శివకృష్ణ, వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి జేడీ నిర్మల, మత్స్య శాఖ అధికారి పి.సురేష్, ఉద్యానశాఖ ఏడీ జెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, పక్కన జేసీ శ్రీధర్, ఆర్డీఓ హేలా షారోన్

బాపట్లలో యువకుడి దారుణహత్య

- దాడిలో మరో యువకుడికి గాయాలు
- సూర్యలంక రోడ్డులోని ఓ రెస్టారెంట్ వద్ద ఘటన
- కారు అద్దాలు పగలగొట్టి బీభత్సం సృష్టించిన ముఠా



హత్యకు గురైన గోరంట్ల వెంకట సుమంత్

బాపట్ల: బాపట్ల సూర్యలంక రోడ్డులో యువకుడి దారుణ హత్య కలకలం రేపింది. సినీ ఫక్కీలో కత్తులు, కర్రలతో అత్యంత ఘోరంగా దాడి చేసి హత్య చేశారు. కారు అద్దాలు పగలగొట్టి బీభత్సం సృష్టించారు. పాతకక్షలే హత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడి స్నేహితుడైన సోనూ అనే యువకుడికి కోసం వచ్చిన ముఠా చివరికి వారు పరారుకావటంతో వీరిపై దాడికి పాల్పడి హత్య చేసినట్లు తెలిసింది. గంజాయి, మద్యానికి బానిసలు కావటమే హత్యకు కారణంగా భావిస్తున్నారు. ఈసంఘటనలో గోరంట్ల సుమంత్(24) అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం బాపట్ల పట్టణంలోని సూర్యలంక రోడ్డులోని ఓ రెస్టారెంట్ వద్ద సాయంత్రం సుమారు 6.30గంటల సమయంలో ఐదుగురు యువకులు రెస్టారెంట్‌లో టిఫిన్ చేసేందుకు రెండు కార్లలో వచ్చారు. ఐదుగురూ మద్యం సేవించటంతో రెస్టారెంట్‌లో పనిచేసే వ్యక్తి బయట తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడిసెలో కూర్చొని తినాల్సిందిగా సూచించాడు. దీంతో ఐదుగురు టిఫిన్ చేసేలోపే కొంతమంది యువకులు ఆటోలో, మరికొంతమంది ద్విచక్రవాహనాల్లో వచ్చి కారు అద్దాలు పగలగొట్టారు. మొత్తంగా చూసినప్పటికి 15మందికిపైగా దాడి చేసిన వారిలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈకారులో వచ్చిన యువకులు ఎక్కడా అంటూ బీభత్సం సృష్టించారు. చీలురోడ్డు వద్ద మాపై దాడి చేసి ఇక్కడికి వచ్చారంటూ కొందరు, మాదగ్గర నగదు తీసుకున్నారంటూ మరికొందరు చెప్పి రెస్టారెంట్‌లోకి ప్రవేశించారు. ఇంతలో అక్కడే ఉన్న మరోవ్యక్తి టిఫిన్ చేసే వారికి సమాచారం ఇవ్వగా ముగ్గురు వ్యక్తులు ఒకవైపునకు పరారు కాగా ఇద్దరు మాత్రమే వారి కంటపడ్డారు. వెంటనే కత్తులు, కర్రలతో దాడి చేయగా గోరంట్ల సుమంత్ అక్కడికక్కడే మృతిచెందగా, మరో యువకుడు అక్కడ నుంచి తప్పించుకుని పరారయ్యాడు.. సుమంత్ బాపట్ల పెయింటర్స్ కాలనీకి చెందిన వినోద్, సుష్మాంజలిల కుమారుడు. బీటెక్ వరకు చదువుకున్న సుమంత్ ఇటీవల హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. మంగళవారం ఉదయమే హైదరాబాద్ నుంచి బాపట్లకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, కుమారుడు మృతి

ఎలుకల మందు తాగిన ఘటనలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

విజయపురిసౌత్: టీలో ఎలుకల మందు కలిపి తాగిన ఘటనలో మంగళవారం మరో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. మాచర్ల మండలం నారాయణరెడ్డి పురం తండాకు చెందిన రవినాయక్, వసంత భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. కుటుంబ కలహాల నేపథ్యంలో వసంత టీలో ఎలుకల మందు కలిపి భర్త, పిల్లలకు ఇచ్చి తాను కూడా అదే టీ తాగిన ఘటనలో ఇప్పటికే ఇద్దరు చిన్నారులు ఈశ్వర్ (3), భాను ప్రకాష్(12) మృతిచెందారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లోని ఆరెంజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఉమేశ్వర్(3) మంగళవారం మృతి చెందాడు. మృతి చెందిన ఉమేశ్వర్, ఈశ్వర్‌లు కవల పిల్లలు. గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వసంత(26) కూడా మంగళవారం సాయంత్రం మృతి చెందింది. భర్త రవినాయక్ హైదరాబాద్ ఆరెంజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితి కూడా విషమంగా ఉంది. వసంత క్షణికావేశానికి నలుగురు ప్రాణాలు కోల్పోవడంతో నారాయణరెడ్డిపురం గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. వసంతపై విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు నమోదైన విషయం విదితమే.

అంబరాన్ని అంటేలా కొండవీడు ఫెస్ట్

- కొండవీడు కోట పర్యాటకుల సంఖ్య పెంచేలా ప్రత్యేక కార్యక్రమం
- 10, 11వ తేదీల్లో అటవీ, పర్యాటక శాఖల సంయుక్త నిర్వహణ
- అందుబాటులోకి రానున్న హెలి రైడింగ్, పారా రైడింగ్, బోటింగ్ సౌకర్యాలు
- అన్ని ఏర్పాట్లు చేశామన్న కలెక్టర్ శివశంకర్



సాక్షి, నరసరావుపేట: రెడ్డి రాజులు 12,13 శతాబ్దంలో కొండవీడును పరిపాలించారని, వారి వైభవాన్ని గుర్తు చేసుకుంటూ 'కొండవీటి ఫెస్ట్ – 2024' పేరిట ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నిర్వహించిన పత్రికా సమావేశంలో ఈ ఉత్సవాల వివరాలు వెల్లడించారు. ఈనెల 10, 11 తేదీలలో వరుస సెలవుల నేపథ్యంలో ఈ ఉత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కొండవీడు కోటను పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తే జిల్లాకు చుట్టుపక్కల జిల్లాల నుంచి, పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్ని ఆ లక్ష్యంతో కొండవీటి కోటను అభివృద్ధి చేశామన్నారు. కొండవీటి కోటలో ఉత్సవాల నిర్వహిస్తే పర్యాటకంగా మరింత అభివృద్ధికి అవకాశం ఉండటంతో ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఆ ప్రాంతమంతా రిజర్వ్ ఫారెస్ట్ కావడంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, పర్యాటకులు సైతం సహకరించి అటవీ రక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమయంలో కొండవీడు కోటను సందర్శిస్తే బాగుంటుందని, అక్కడికి వచ్చే సందర్శకుల కోసం యువత, చిన్న పిల్లలు, పెద్దల కోసం ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కొండవీడు కోటలో ప్రధానంగా ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, షూటింగ్, ఆర్చరీ, చెరువులో బోటింగ్, ఫిషింగ్, హార్సింగ్ ఏర్పాటు చేశామన్నారు. అక్కడకు వచ్చే పర్యాటకులు రాత్రి విడిది చేసేందుకు 'నైట్ క్యాంప్'లో భాగంగా టెంట్, భోజన వసతులను ఏర్పాటు చేశామన్నారు.

ప్రత్యేకంగా హెలిరైడ్...

కొండవీడు ఫెస్ట్–2024 సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా హెలీకాప్టర్ ద్వారా ఈ ప్రాంతాన్ని చూపించే విధంగా హెలీరైడ్‌ను ఏర్పాటుచేశామని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం ఒక్కొక్కరికి రూ.4 వేలు వసూలు చేసి ఏడు నిమిషాలపాటు రైడ్ ఉంటుందన్నారు. పారామోటార్ రైడ్ ఏర్పాటుచేశామని, ఒక్కొక్కరికి రూ.2వేలు, హార్స్ రైడుకు రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉత్సవాల తరహాలో చిన్నపిల్లల కోసం ప్లే ఏరియాను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పూల తోటలతోపాటు ఇసుకను ఏర్పా టు చేయించి అందులో సైతక శిల్పం తరహాలో ఆర్ట్ గీసేలా ఏర్పాటుచేస్తామన్నారు. వీటితోపాటు చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా నృత్య ప్రదర్శనలకు ప్రత్యేకంగా వేదిక ఏర్పాటుచేసి క్లాసికల్, వెస్టర్న్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు రూ.10,116 నుంచి రూ.2,500 బహుమతులు అందజేస్తామన్నారు.

కంటివెలుగుతో ఉచిత శస్త్ర చికిత్సలు

కంటివెలుగు జాయింట్ డైరక్టర్ డాక్టర్ సునీల్



పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న జేడీ సునీల్

చినగంజాం: కంటివెలుగు కార్యక్రమం ద్వారా పరీక్షలు నిర్వహించి, అవసరత ప్రకారం కంటి శస్త్రచికిత్సలు నిర్వహించాలని కంటివెలుగు జాయింట్ డైరక్టర్ డాక్టర్ సునీల్ పేర్కొన్నారు. మంగళవారం చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. జగనన్న ఆరోగ్య సురక్ష–1 కార్యక్రమంలో క్యాటరాక్ట్ ఆపరేషన్‌లకు గుర్తించిన వారందరూ వెంటనే ఆపరేషన్‌లు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా ఆపరేషన్‌లు చేయిస్తోందని, ఈ సదవకాశాన్ని చినగంజాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కొత్తపాలెం గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజలతో ఆయన స్వయంగా మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఆప్తాల్మిక్ అధికారి భూషణం, వైద్యాధికారులు డాక్టర్ ఎస్.విజయభాస్కర్, డాక్టర్ పి.సాయిశ్రీ చరణ్, సూపర్‌వైజర్ చిరంజీవి, ఉల్లా రాణి, ఏఎన్ఎంలు, ఆశలు, మురళి, మహేష్, ఎంఎన్ఓ సుబ్బారావు పాల్గొన్నారు.

యార్డుకు 1,22,285 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,22,285 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,19,344 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి నగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 83,823 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల దౌర్జన్యం

- బలవన్మరణానికి యత్నించిన టైలర్
- పరిస్థితి విషమం



చిలకలూరిపేట ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వింజమూరి వెంకటరామయ్య

నాదెండ్ల: ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల దౌర్జన్యానికి ఓ వ్యక్తి బలవన్మరణానికి యత్నించి ఆసుపత్రిలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ సంఘటన గణపవరం గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులో కొచ్చింది. గ్రామానికి చెందిన వింజమూరి వెంకటరామయ్య పాతికేళ్లుగా టైలర్‌గా పనిచేస్తున్నాడు. భార్య వెంకటసుబ్బమ్మ గణపవరంలోని శాంతినగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఆయాగా విధులు నిర్వహిస్తోంది. వెంకటరామయ్య స్వగ్రామం చిలకలూరిపేట రూరల్ మండలం లింగంగుంట్ల కాగా, వివాహం అయినప్పటి నుంచి గణపవరంలోనే నివాసం ఉంటూ టైలరింగ్ చేస్తున్నాడు. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. 2022 జనవరిలో ఓ ఫైనాన్స్ సంస్థ ద్వారా ఫ్రిజ్ కొనుగోలు చేశాడు. నెలసరి కిస్తీలను సక్రమంగా చెల్లించి రుణాన్ని చెల్లించాడు. దీంతో సంస్థ వారు ఫోన్ చేసి రుణ చెల్లింపులు సకాలంలో చేసినందున రూ.2 లక్షలు రుణం మంజూరైందని తెలిపారు. వెంకటరామయ్య రుణం తీసుకునేందుకు అంగీకరించటంతో 2022 అక్టోబర్ 27న తన బ్యాంకు ఖాతాకు రూ.1,31,849 జమ చేశారు. అప్పటి నుంచి 14 నెలల పాటూ నెలకు రూ.6039 చొప్పున మొత్తం రూ.84,546లు చెల్లించాడు. ఇటీవల అనారోగ్యానికి గురికావటంతో నెలవారి ఈఎంఐ చెల్లించలేదు. ఈ నెల 1న షాపు వద్దకు వచ్చిన ఫైనాన్స్ సంస్థ సిబ్బంది తక్షణమే ఈఎంఐ చెల్లించాలంటూ ఒత్తిడి చేశారు. తమ సంస్థకు ఇంకా రూ.93,098 చెల్లించాలన్నారు. తాను రూ.84,546 చెల్లించానని, రూ.47,303 మాత్రమే చెల్లించాల్సి ఉందని బాధితుడు విన్నవించినా వారు పట్టించుకోలేదు. తన ఆరోగ్యం సరిగా లేదని, ఆరోగ్యం కుదుటపడ్డాక చెల్లిస్తానని చెప్పినా వారు వినకుండా, నీవు చచ్చినా నీ శవం నుంచి వసూలు చేస్తామంటూ బెదిరించారు. తీవ్ర మనస్తాపానికి గురైన బాధితుడు అదేరోజు సాయంత్రం కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి సేవించాడు. ఇంటికి వచ్చి ఎవరికీ చెప్పకుండా నిద్రపోయాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో వాంతులు చేసుకోవటంతో కుటుంబ సభ్యులు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారమివ్వటంతో చిలకలూరిపేట పోలీసులు ఆసుపత్రికి చేరుకుని బాధితుడి నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు.

క్లుప్తంగా

జిల్లా రెవెన్యూ అధికారి బదిలీ

బాపట్ల: బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిగా పని చేస్తున్న పి.వి.రమణను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయనను బాపట్ల నుంచి మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్‌కు బదిలీ చేశారు. స్త్రీ,శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిణిగా విధులు చేపడుతున్న చిన్నం సుధారాణిని సైతం బదిలీ చేశారు.

పాఠశాల విద్య ఆర్జేడీగా లింగేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ గుంటూరు జోన్ ఆర్జేడీగా బి.లింగేశ్వరరెడ్డి నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీవైఈఓలకు డీఈఓలుగా, డీఈఓలకు ఆర్జేడీలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈమేరకు విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారిగా ఉన్న బి.లింగేశ్వరరెడ్డికి ఆర్జేడీగా ఉద్యోగోన్నతి కల్పించిన ప్రభుత్వం ఆయనకు గుంటూరు జోన్ ఆర్జేడీగా పోస్టింగ్ కల్పించింది. కాగా ప్రస్తుత ఆర్జేడీ వీఎస్ సుబ్బారావును పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌లో టెట్ విభాగానికి జాయింట్ డైరెక్టర్‌గా నియమించింది.

పల్నాడు, బాపట్లలకు కొత్త డీఈఓలు..

పల్నాడు డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న ఎం.వెంకటేశ్వర్లు పల్నాడు డీఈఓగా, నెల్లూరు డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న కె.నారాయణరావు బాపట్ల జిల్లా డీఈఓగా నియమితులయ్యారు.

దిశ పీఎస్ డీఎస్పీగా బి.వి.సుబ్బారావు

పట్నంబజారు: గుంటూరు దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీగా బి.వి.సుబ్బారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో విజయవాడ ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న ఆయన్ను దిశ డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు మంగళవారం నగరంపాలెంలోని దిశ పీఎస్‌లో బాధ్యతలు స్వీకరించారు.

దేవాలయాల పరిరక్షణ అందరి బాధ్యత

దేవదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావు

యద్దనపూడి: సనాతన సంస్కృతీ, సంప్రదాయాలను పాటిస్తూ ఆలయాల చారిత్రక సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దేవదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావు అన్నారు. మంగళవారం సాయత్రం మండలంలోని పూనూరు గ్రూపు దేవాలయాలను ఆయన సందర్శించారు. తొలుత గ్రామంలోని వేణుగోపాలస్వామి, త్రిపురాంతకస్వామి ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న ఈదరవారి చెరువును పరిశీలించి చెరువు మరమ్మతులు చేపట్టాలని ట్రస్టు చైర్మన్ ఈదర శివయ్యకు సూచించారు. అనంతరం వేణుగోపాలస్వామి రథశాల నిర్మాణానికి శాఖాపరమైన సహకారం అందిస్తానని గ్రామస్తులకు తెలిపారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి

రవాణా శాఖ ఉప కమిషనర్ షేక్ కరీం


మాట్లాడుతున్న ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం

గుంటూరు ఎడ్యుకేషన్: వాహనదారులు రహదారి భద్రత నిబంధనలు విధిగా పాటించాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీటీసీ కరీం మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించడం వలన ప్రమాదాలను నివారించవచ్చునని, వాహన చోదకుల రక్షణ కోసమే నిబంధనలు అమలు చేస్తున్నామని చెప్పారు. రహదారి భద్రతపై తోటి కళాశాలల విద్యార్థులను చైతన్యపర్చి, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కృషి చేయాలని సూచించారు. వాహన చోదకులు ఆలోచనా విధానంలో మార్పు రావాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా తమను తాము రక్షించుకోగలరని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. గుడ్ సమ్మరీటం పథకం గురించి వివరిస్తూ, రోడ్డు ప్రమాదాల బారిన పడిన బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రి, ట్రామా కేర్ సెంటర్‌కు తరలించి, తక్షణ వైద్య సహాయాన్ని అందించడం ద్వారా ప్రాణాలను రక్షించినవారవుతారని తెలిపారు. అందుకు గాను ప్రభుత్వం గుడ్ సమరిటన్‌కు అవార్డు మంజూరు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో మోటారు వాహన తనిఖీ అధికారులు ఎస్.గోపాల్, తోట రాఘవరావు, కె.మల్లీశ్వరి, రహదారి భద్రత ఎన్జీవో రాజకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి జేవీ సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు అంజనీకుమార్, ఆర్.జయ శైలజ పాల్గొన్నారు.

నులి పురుగుల బారి నుంచి రక్షించుకోవాలి

- డీఎంహెచ్ఓ విజయలక్ష్మి
- జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ

గుంటూరు మెడికల్: నులి పురుగుల బారిన పడిన పిల్లలు శారీరకంగా, మానసికంగా బలహీన పడతారని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. పిల్లల్లో నులి పురుగుల నివారణ సమస్య కోసం తప్పనిసరిగా నులిపురుగు నివారణకు వినియోగించే అల్బెండజోల్ మాత్ర ఇవ్వాలని సూచించారు. గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రైవేటు పాఠశాలలు, జిల్లా కోఆర్డినేషన్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగాఇ 19 ఏళ్లలోపు పిల్లందరికి అల్బెండజోల్ మాత్రలు చప్పరించి మింగేలా చూడాలన్నారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర పౌడర్ చేసి నీళ్లల్లో కరిగించి మింగించాలని కోరారు. ఈమాత్ర తీసుకోవడం ద్వారా ఎలాంటి దుష్పరిణామాలు ఉండవని, ఒక వేళ ఏమైనా తలెత్తితే తక్షణమే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. 9న పిల్లలు ఎవరైనా మాత్రలు తీసుకోని పక్షంలో 16న మాత్రలు ఇవ్వాలని, మందులను మండల అభివృద్ధి అధికారి ద్వారా పంపిణీ చేస్తున్నామని వివరించారు. జిల్లా విద్యా శాఖ అధికారి శైలజ మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం గురించి పాఠశాల విద్యార్థుల డైరీలో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పిల్లలందరికీ మాత్రలు ఇవ్వాలని, పిల్లల చేతికి మాత్రలు ఇవ్వకుండా ఉపాధ్యాయులు పిల్లలు నమిలి చప్పరించి మింగేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ జిల్లా అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.వి. సుబ్బరాజు, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి, డెప్యూటీ డీఈఓ నిర్మలా పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించాలి

తెనాలిఅర్బన్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఈ నెల 9న నిర్వహించనున్నట్లు, దానిని అందరూ విజయవంతం చేయాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పిలుపునిచ్చారు. తెనాలి డెప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ల పరిధిలో పనిచేసే ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏళ్లు ఉన్న పిల్లలను ఆల్బెండజోల్ మాత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. అధికారులు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉదయం నుంచి విధులు నిర్వహించాలని చెప్పారు. అందుకు అవసరమైన మందులను కూడా ప్రభుత్వం సరఫరా చేసిందని వివరించారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించే అందరికి వీటిని పంపిణీ చేసేలా చూడాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ దేవికవాణి, డాక్టర్ మౌనిక, మలేరియా అధికారులు ప్రభాకర్‌రెడ్డి, ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శివగణేష్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు ఎంతో ఉపయుక్తం ఓబీఈ

ఐపీఎస్సీ సొల్యూషన్స్ చైర్మన్ డాక్టర్ మెండస్ జాకబ్



గుంటూరు ఎడ్యుకేషన్: అవుట్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) విద్యా విధానంలో ప్రశ్నాపత్రాల రూపకల్పన ద్వారా అధ్యాపకులు మరింత నిష్ణాతులుగా మారవచ్చునని ప్రముఖ విద్యావేత్త, కేరళలోని ఐపీఎస్సీ సొల్యూషన్స్ చైర్మన్ డాక్టర్ మెండస్ జాకబ్ పేర్కొన్నారు. స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఐక్యూఏసీ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా కళాశాల–ఐపీఎస్ఆర్ సొల్యూషన్స్‌తో ఓబీఈ ఇంప్లిమెంటేషన్ అండ్ క్వశ్చన్ బ్యాంక్ ప్రిపరేషన్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అనంతరం జరిగిన సదస్సులో డాక్టర్ జాకబ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ విధానం ద్వారా పరీక్ష పత్రాల రూపకల్పన ఓబీఈ ఎడ్యుకేషన్ అనుసరించడం అకడమిక్ కరికులంను సులభతరం చేసుకోవచ్చనన్నారు. బ్లూమ్ టిక్సనోమి ద్వారా గుర్తుంచుకోవటం, అర్థం చేసుకోవడం, అనువర్తనం, విశ్లేషణ, పోలిక, కొత్త ఆలోచనల రూపకల్పన, సృజనాత్మకత వంటి ఆరు అంశాల ద్వారా విద్యార్థులకు అధ్యాపకులు తమ బోధన ద్వారా నైపుణ్యాలను మెరుగుపరచుకుంటారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ ఆన్‌లైన్ పరీక్ష విధానాన్ని రూపొందించుకోవడంలో రాష్ట్రంలోనే ప్రభుత్వ మహిళా కళాశాల మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. రెండు రోజులపాటు నిర్వహించే సదస్సు ద్వారా అధ్యాపకులందరినీ బోధనలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతామన్నారు. సదస్సులో ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ డి.మధుసూదనరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.విజయశ్రీ, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ విజయ కుమారి, డాక్టర్ జి.మల్లికార్జునరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దూషించే వారిపై కేసు నమోదు చేయాలి

ఏపీ దళిత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరబండి ఆంథోనీ

సత్తెనపల్లి: దళిత ఉద్యమ శిఖరం డాక్టర్ కత్తి పద్మారావుపై కొంత మంది ఉద్దేశ పూర్వకంగా అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ యూట్యూబ్‌లో వీడియోలు చేస్తూ విడుదల చేస్తున్నారని వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఏపీ దళిత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరబండి ఆంథోనీ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శివశక్తి అనే యూట్యూబ్ చానల్‌లో కరుణాకర్, లలిత కుమార్, హమారా ప్రసాద్ అనే ఈ ముగ్గురు పద్మారావును దూషిస్తూ వీడియోలు పెడుతున్నారని, ఆ వీడియోలో వాళ్లు వాడిన పదజాలం దళితులను కించపరిచేలా ఉందన్నారు. ఆయనతోపాటు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్, బహుజన సమాజ్ పార్టీ నాయకుడు బరకా కిషోర్ బాబు, అంబేడ్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు దావులూరి కోటేశ్వరరావు, అంబేడ్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ జిల్లెళ్ల పాల్ రాజ్, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్, తదితరులు ఉన్నారు.

వ్యవసాయ యంత్రాల నిర్వహణపై అవగాహన అవసరం

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ స్మిత్


మాట్లాడుతున్న కళాశాల డీన్ డాక్టర్ స్మిత్

బాపట్ల: వ్యవసాయ పరికాల ప్రాథమిక మరమ్మతులు తెలిసి ఉంటే నిర్వహణ ఖర్చును తగ్గించుకోవటంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చని బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టరు డీడీ స్మిత్ పేర్కొన్నారు. బాపట్లలోని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులు పాటు వ్యవసాయ ట్రాక్టర్ పరికరాల మరమ్మతులు, నిర్వహణ కార్యక్రమంపై రైతులకు, గ్రామీణ యువతకు శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ స్మిత్ మాట్లాడుతూ వ్యవసాయ పరికారాల పనితీరు తెలుసుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. యంత్రాల నిర్వహణ ప్రతి రైతుకు తెలిసి ఉంటే ఖర్చు తగ్గించుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బి.హరిబాబు, డాక్టరు ఏ.అశోక్‌కుమార్, పి.తేజశ్రీ,, జాన్‌వెస్లీ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు

డ్వామా పీడీ అర్జున్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న అర్జున్‌రావు

అద్దంకి రూరల్: క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలో క్షుణ్ణంగా పరిశీలిస్తామని డ్వామా పీడీ బీ.అర్జున్‌రావు అన్నారు. మంగళవారం అద్దంకి మండల పరిషత్ కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన ఎన్ఆర్ఈజీఎస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన 719 పనులకు రూ.8.55 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సంబంధిత పనుల వివరాలను గ్రామ పంచాయతీల వారీగా అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీపీవో కేఎస్ఎస్ శోభన్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ ఆవులయ్య, ఏపీవో గాయత్రి లక్ష్మీ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కోల్ట్ స్టోరేజ్ ప్రమాదంపై విచారణ

సబ్‌కలెక్టర్‌కు ఏపీ పసుపు రైతు సంఘం వినతి


సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్‌తో సంఘ నాయకులు

తెనాలి: దుగ్గిరాలలో శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో అగ్నిప్రమాదంపై విచారణ పారదర్శకంగా ఉండాలని, నివేదికను త్వరగా రైతులకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం నాయకులు మంగళవారం తెనాలిలో సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన సబ్‌కలెక్టర్.. అగ్నిప్రమాదం కారణాలపై విచారణ చేసి నివేదికను ఇచ్చేందుకు కొంత వ్యవధి పడుతుందని చెప్పారు. అయినప్పటికీ సాధ్యమైనంత త్వరగా నివేదికను ఇవ్వాలని మార్కెటింగ్ శాఖ, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కోల్డ్ స్టోరేజికి సంబంధించిన అన్ని రికార్డులను సీజ్ చేశామని చెబుతూ రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదని, ప్రభుత్వానికి నివేదించి తగిన న్యాయం జరిగేందుకు ప్రయత్నం చేయగలనని హామీనిచ్చారు. పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజిలో దగ్ధమైన పసుపు పంటకు క్వింటాలుకు రూ.11 వేలతో పాటు పూర్తి ఇన్సూరెన్స్ ఇవ్వాలనీ, కోల్డ్‌స్టోరేజి అద్దెలు, బ్యాంకు రుణాలు రద్దు చేయాలని కోరారు. సంఘం నేతలు వేములపల్లి వెంకట్రామయ్య, ములకా శివసాంబిరెడ్డి, కాజా వెంకటేశ్వరరావు, టి.రమాదేవి, భీమవరపు శేషిరెడ్డి, ఎం.చంద్రశేఖరరావు, బి.సురే, ఎస్.సురేంద్ర, ఎం.ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ల సమస్యలపై వినతి


సీడీఎంఏను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: మున్సిపల్ కమిషనర్ల సమస్యలు పరిష్కరించాలని మిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)ను ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మంగళవారం విన్నవించారు. సీడీఎంఏగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకేష్ బి లత్కర్‌ను ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్స్‌కు సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం శ్రీకేష్ బి లత్కర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, అడిషనల్ డైరెక్టర్ శివపార్వతి, అధ్యక్షులు కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి బి. బాలస్వామి, కోశాధికారి శివారెడ్డి, ఉపాధ్యక్షులు భవానీ ప్రసాద్, కార్యనిర్వహణాధికారి ఎం.ఏసుబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- వీసీ ఆచార్య రాజశేఖర్
- లైటింగ్ యాజ్ ఏ డిజైన్ లాంగ్వేజ్ పై వర్క్‌షాప్ ప్రారంభం


ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్, వేదికపై ఆచార్య శ్రీనివాసరెడ్డి

ఏఎన్‌యూ: ప్రస్తుతం మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఆర్కిటెక్చర్ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ కళాశాల ఆధ్వర్యంలో 'లైటింగ్ యాజ్ ఎ డిజైన్ లాంగ్వేజ్' అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహిస్తున్న వర్క్‌షాపు మంగళవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ ప్రపంచవ్యాప్తంగా కొత్త కొత్త అనుభూతులు, వినూత్న ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక దృశ్య రూపాలను ఆవిష్కరించే క్రమంలో ఆర్కిటెక్చర్ విద్యార్థులకు నైపుణ్యాలు మెండుగా ఉండాలని సూచించారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ డెప్యూటీ ప్లానర్ కె.అశోక్ కుమార్ మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ సిల్వర్ లాంటిదని, క్రియేటివిటీ బంగారం లాంటిదని ఈ రెండు కలిస్తే అద్భుతమైన అంకురార్పణ చేయవచ్చునన్నారు. సదస్సుకు ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఈ. శ్రీనివాస రెడ్డి అధ్యక్షత వహించగా, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పనుల్లో అలసత్వం వద్దు

- జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- పట్టణంలోని 5, 7 వార్డు సచివాలయాల సందర్శన


7వ వార్డు సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

సత్తెనపల్లి: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని 5,7 వార్డు సచివాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల పట్టాల ద్వారా శాశ్వత భూహక్కు కలిగేలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా జరుగుతుందన్నారు. సర్వర్ సమస్య ఎదురయ్యేటప్పుడు గమనించి గ్రామ రెవెన్యూ అధికారులు, వార్డు అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది ముందస్తుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. లబ్ధిదారులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అందరికీ రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి సూచనలు చేశారు. ఆయనతో పాటు సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ, తహశీల్దార్ సిహెచ్ ఉష, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రేషన్ పంపిణీలో వలంటీర్ల హాజరు తప్పనిసరి

నరసరావుపేట: వలంటీర్లు ఎండీయూ వాహనాల వెంట ఉంటూ లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదు ఆదేశించారు. మంగళవారం ఆయన పట్టణంలోని ప్రకాష్‌నగర్, పాటు మండలంలోని ఇక్కుర్రు గ్రామంలో ఎండీయూ వాహనాల ద్వారా జరుగుతున్న రేషన్ పంపిణీని పరిశీలించారు. కార్డుదారులకు పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ బియ్యం, గోధుమపిండి, పంచదార సరుకులను పరిశీలించారు. ఎండీయూ వాహనాల సిబ్బంది తమకు కేటాయించిన లొకేషన్లలో వాహనాలను ఆపి సరుకులు పంపిణీ చేస్తున్నారా లేదా అంటూ కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మశ్రీ, డీటీ కొండారెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష

అధికారులకు కలెక్టర్ శివశంకర్ దిశానిర్దేశం


కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమీక్షిస్తున్న కలెక్టర్

నరసరావుపేట: మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి, 19 నుంచి మొదలు కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ నుంచి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల సిబ్బందితో పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలని, తాగునీటి వసతి, ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు 48 సెంటర్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొత్తం 30,180 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 127 సెంటర్లలో మొత్తం 29,244 మంది విద్యార్థులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలుపరచాలని ఆదేశించారు. విద్యార్థులకు సమాచారాన్ని అందించేలా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని, కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి అవసరమైన ఆయా శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ నెల 11 నుంచి 20 వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు 84 సెంటర్లలో నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. ట్రైనీ కలెక్టర్ కేఆర్.కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, విద్యాశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

డీఎంహెచ్‌వో డాక్టర్ రవి



నరసరావుపేట: జిల్లాలో హైరిస్క్ ప్రాంతాలైన ఇటుక బట్టీలు, మురికివాడలు, భవన నిర్మాణ కార్మికులు, జాలర్లు ఉండే ప్రదేశాలను గుర్తించి అర్హులైన ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో టీకాలు ఇప్పించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ.రవి ఆదేశించారు. మంగళవారం పెద్దచెరువులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మార్చి 4 నుంచి నిర్వహించే పల్స్ పోలియో, వ్యాక్సిన్ ప్రివెంటబుల్ వ్యాధుల గురించి సంబంధిత అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రద్దీగా ఉండే బస్టాండ్, రైల్వేస్టేషన్, దేవాలయాలు, సంతలు లాంటి ప్రాంతాలపై నిఘా ఉంచి పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని కోరారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

నరసరావుపేట: ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు బుధవారం జిల్లాలోని ఎనిమిది చోట్ల నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి మంగళవారం తెలిపారు. చిలకలూరిపేట సుగాలి కాలనీలోని అర్బన్‌హెల్త్‌సెంటర్, దాచేపల్లి అర్బన్‌హెల్తె సెంటర్, గురజాల శ్రీరాంపురం అర్బన్ హెల్తెసెంటర్, మాచర్ల కోర్టుబజారులోని అర్బన్‌హెల్త్ సెంటర్, నరసరావుపేట బాబాపేట సెక్రటేరియేట్, పిడుగురాళ్ల జానపాడురోడ్డులోని గుంతస్కూలు, సత్తెనపల్లి మదర్సా పీర్లచావిడి, వినుకొండ హనుమానగర్ ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆయా ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.